# ఆనందకాననం

బందరులో, యిన్నూ రేళ్ళనాడు, ఓ కుమ్మరి కుటుంబం—యిప్పటి గూడూరు వంతెనకు చేరువను, గూడూరు పోయే డొంక పక్కను ఉంటూండగా - ఆ ఇంట తొలుచూలు ఆడపిల్ల పుట్టింది. నూటొక్క తప్పెట కట్టుకుని 'అమ్మోరి' ఊరేగింపు సాగివస్తూ ఆ మొగదలకు వచ్చేసరికి అన్ని తప్పెటలూ ఒక మెయిని ఫెళ్ళుమనే సరికి - నీళ్ళాడే పొద్దుకైన ఆడకూతురికి సులువుగా పురుడు వచ్చింది. పుట్టిన బిడ్డకు మూడు మాసముల దాకా కళ్ళు తెరిపిని పడలేదు. అదన్నా ఎలా? ఆ ప్రాంతాల

బంగారయ్య అనే యోగి సంచారం చేస్తూండేవాడు. మనిషి మేలిమి చాయ, జడలు బంగారు తీగెలు. ఎప్పుడూ నవ్వుకుంటూ వుండేవాడు. అది నాట్యమో, నడకో తెలియదు. ఎప్పుడూ మునివేళ్ళమీద వుండేవాడు. ఆ మనిషి ఒకనాడు వున్నట్టుండి యీ బిడ్డను ఎగరేసుకు పోయినాడు. జనం ఏం మహత్తు పుట్టబోతూందో అని వెంట బడ్డారు. అలా పోయి పోయి, శ్రీ వేణుగోపాలస్వామివారి సన్నిధికి జేరుకొని గొంతున మురళి పలికిస్తూ, చిందులు వేశాడు. పసికందు ఝల్లుమని నవ్వి కళ్ళు తెరిచింది; ఆ బిడ్డకు అలా నెలలనాడే దీవెన వచ్చింది. ఏళ్ళు తిరిగినవి. బిడ్డ నేవళాన ఎదిగింది. ఒత్తరితనం వచ్చింది. ముంతెడు కొప్పు, వల్లమాలిన వయ్యారం. తల్లి పైట వేయబోయింది. ఉహుఁ! పావురాయి వాన చినుకులు విదిలించుకున్నట్టు విదిలించుకుంది. ఈడొచ్చేసరికి మాట వచ్చింది. నీ పేరేమిటమ్మా అంటే ఆనందం అని పకపక నవ్వేది. ఎప్పుడూ వేణుగోపాల సన్నిధిలోనే వుండేది. ఎల్లవేళలా నాట్యం మీదే వుండేది. ఏటికేడాది ఆలయం ముందే, తిరునాల - ఓ తీర్థప్రజ. అలా మూడేళ్ళు జరగ్గా, ఆలయానికి ప్రాకారం కట్టే ఉద్దేశం కొందరు సజ్జనులకు కలిగింది. ఆ బిడ్డ మరి ఆలయం చాయలకు రాలేదు. తాను పుట్టిన చోటికి చేరుకుంది. ఒక్క ఏడాదికి నిలువెత్తు కృష్ణ విగ్రహం చేసుకున్నది. కొన్నాళ్ళకు ఆ పట్టు బృందావనం అయింది. కొన్నేళ్ళపాటు అది యాత్రాస్థలం అయింది. తెలుగుసీమలో ఆనాడు పేరు మోగే నాట్యసానులందరూ అక్కడ మూడు రాత్రులు సేవించుకొనే మొక్కులమీద వచ్చేవారట. ఆ బిడ్డ చలవను ఆనాడు ప్రతి ఒక్క ఆడకూతురు నాట్యం నేర్చిందట. ఆ చాయలు తిరుగాడితే చాలు, నాట్యం అబ్బేదట. క్షేత్రయ్య ఆ వైభవం తిలకించాడట. అలా నాలుగు ఏడులు గడచినా, ఆ బిడ్డకు పదారేళ్ళ రామణీయకమేనట! ఉన్నట్టుండి ఆ నడి వేసవిలో ఓ పున్నమికి జల్లుకొట్టి, ముసురుకొట్టి అది వాన కాదు - మిన్నూ మన్నూ పనగలసి పోయిందట. ఎక్కడి వారక్కడ దూసుకున్నారు. ఈ బిడ్డ స్వామివారిని కౌగిలించుకుని ఉందట. అది అందరూ చూశారు. ఎలాగైనా అక్కడి నుంచి, పొడిచోటికి చేర్చాలని భయభక్తులతో పెనుగులాడారు. ఎవరి వల్లా కాకపోగా, వాన తాకిడికి నిలువలేక, స్వామిమీద భారం వేసి తల దాచుకొన్నారు. వాన వెలిసింది, అంతా ఏకార్ణవం, స్వామిలేడు, ఆ బిడ్డా లేదు. మరి కనబడలేదు. కాని యీ నాటికీ, ఆ పుంతను పోయే గోవు, అక్కడ ఆగి, మోకరిలి ఆ పట్టున తల మోపి మొక్కి-కాని పోదు. ఈ కథ విననోచిన ధన్యులకు కలకాలం అందినంత మేరా-బృందావనం!